నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
08.
nipuna
Every Wednesday Free Supplement
3 జూలై 2024
పేజీలు 8

## ప్రపంచ వర్షాధార అడవుల రోజు

ఏటా జూన్ 22న ప్రపంచ వర్షాధార అడవుల రోజుగా నిర్వహిస్తారు. జీవ వైవిధ్యానికి చాలా కీలకమైనవి ఈ వ్యవస్థలు. ప్రపంచపు అతిపెద్ద సహజ ఔషధ ప్రదేశంగా వీటిని పిలుస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'మన వర్షాధార అడవుల పరిరక్షణకు ప్రపంచాన్ని సమాయత్తం చేయడం'.


## అంతర్జాతీయం

### యూరోపియన్ యూనియన్

- సంభాషణ నియంత్రణ చట్టాన్ని యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రతిపాదించింది. ఆన్‌లైన్‌లో బాలలను లైంగిక హింస నుంచి దూరంగా ఉంచాలన్న ఉద్దేశంతో ఈయూ ప్రతిపాదన చేసింది. నిజానికి ఈ చట్టాన్ని 2022లో ప్రవేశపెట్టారు. బాలలను లైంగికంగా ఇబ్బందులకు గురిచేసే అంశాలను ఆయా సంస్థలు నిలువరించాలి. ఇదంతా స్వయంచోదకంగా జరగాలన్నది ప్రతిపాదన.

### యూఎన్‌సీటీఏడీ

- జెనీవా కేంద్రంగా పనిచేసే సంస్థ యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రపంచ వ్యాప్తంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో ఎఫ్‌డీఐలు 2% తగ్గాయని పేర్కొంది. అలాగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు వనరుల సమీకరణ కూడా తగ్గిందని, దీనిపై అగ్రదేశాలు దృష్టి సారించాలని సూచించింది.




### కెన్యా

- నాటోయేతర ప్రధాన భాగస్వామ్య దేశంగా ఆఫ్రికా ఖండంలోని కెన్యాను అమెరికా గుర్తించింది

### తజకిస్థాన్

- హిజాబ్‌ను నిషేధిస్తూ తజకిస్థాన్ పార్లమెంట్ మజిల్సి మిల్లి ఒక చట్టాన్ని చేసింది. పార్లమెంట్ చేసిన ఈ చట్టంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

### రష్యా

- సైనిక సహకారంలో భారత్, రష్యా కీలక ఒప్పందానికి వచ్చాయి. భారత్‌తో లాజిస్టిక్స్‌కు సంబంధించిన ముసాయిదాను రష్యా ఆమోదించింది. మిలిటరీ ఆపరేషన్స్, శాంతి రక్షక దళాలు, మానవ సాయం, ఉమ్మడి సైనిక విన్యాసాలు తదితర సమయాల్లో భారత్ నుంచి రష్యాకు, రష్యా నుంచి భారత్‌కు మౌలిక సదుపాయాల సాయం అందడమే ఈ ఒప్పంద ప్రధాన లక్ష్యం. ఈ ఒప్పందం అమలైతే ఐదు సంవత్సరాల పాటు చలామణిలో ఉంటుంది. ఈ తరహా ఒప్పందం భారత్‌కు ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, సింగపూర్, ఆస్ట్రేలియా, జపాన్‌లతో జరుగుతుంది.

### పరాగ్వే

- అంతర్జాతీయ సౌర కూటమిలో 100వ దేశంగా పరాగ్వే చేరింది. దక్షిణ అమెరికా ఖండానికి చెందిన దేశం ఇది. భారత్‌లోని హర్యానాలో గురుగ్రామ్ కేంద్రంగా అంతర్జాతీయ సౌర కూటమి పని చేస్తుంది.



## ఆర్థికం

### 53వ జీఎస్టీ సమావేశం

- స్టీల్, ఐరన్, అల్యూమినియం, పాల క్యాన్లు తదితరాలపై 12% జీఎస్టీ విధించాలని జీఎస్టీ మండలి తన 53వ సమావేశంలో నిర్ణయించింది. అలాగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. అవి.. రైల్వేల ద్వారా సాధారణ పౌరుడికి అందే సేవల నుంచి జీఎస్టీ మినహాయింపు, ఉదాహరణకు ప్లాట్‌ఫాం టికెట్లు, వెయిటింగ్ రూమ్స్ తదితరాలు
- చిన్న పన్ను చెల్లింపుదారుల ప్రయోజనం కోసం జీఎస్టీఆర్-4ను ఏప్రిల్ 30 నుంచి జూన్ 30 వరకు పొడిగించారు.



### సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

- మినీరత్న క్యాటగిరీ-1 హోదాను సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు కల్పించనున్నారు. నష్టాల నుంచి గట్టెక్కి నికరంగా రూ.58 కోట్ల లాభాలు దక్కించుకున్నందుకు ఈ సంస్థను మినీరత్న జాబితాలో చేర్చారు.

### బొగ్గు గ్యాసిఫికేషన్

- భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్‌ను దేశంలో తొలిసారి జార్ఖండ్‌లో చేపట్టారు. బొగ్గును మీథేన్, హైడ్రోజన్ వాయువులుగా మార్చే ప్రక్రియ ఇది. జాంతారా జిల్లాలో కాస్ట బ్లాక్‌లో ఈ ప్రక్రియను తొలిసారి అందుబాటులోకి తెచ్చారు.

### రుణ విధానంలో మార్పులు

- ప్రాధాన్య రంగాలకు రుణాలు ఇచ్చే అంశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వల్ప మార్పులు చేసింది. దీన్నే ఇంగ్లిష్‌లో ప్రయారిటీ సెక్టార్ లెండింగ్ అంటారు. వివిధ నగరాల రుణ ప్రవాహం ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు. దీని ద్వారా ప్రాంతీయ అసమానతలను గణించేందుకు వీలుంటుంది. 2024-25 నుంచి 2026-27 వరకు ఇది అమల్లో ఉంటుంది.

## జాతీయం

### చాడ్విక్ హౌస్

- ఇది భారత కాగ్‌కు సంబంధించి కీలకమైన భవనం. ఇది సిమ్లాలో ఉంది. పునరుద్ధరించిన ఈ భవనాన్ని జూన్ 24న ఆవిష్కరించారు. 'చాడ్విక్ హౌస్: నావిగేటింగ్ ఆడిట్ హెరిటేజ్' అనే ఇతివృత్తంతో ఇది తాజాగా ప్రారంభమయ్యింది. భారత ఆడిటింగ్‌కు సంబంధించి వారసత్వాన్ని కాపాడుకొనేందుకు ఉద్దేశించింది ఇది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇక్కడే ఆడిటింగ్‌కు సంబంధించి శిక్షణ ఇచ్చే వాళ్లు. పాతబడటంతో 2018లో కూల్చివేయాలని భావించగా దీన్ని కాగ్ స్వీకరించి పునరుద్ధరించింది. ఈ భవనానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. క్యాబినెట్ మిషన్‌కు సంబంధించి 1946లో మహాత్మాగాంధీ సిమ్లాకు వచ్చినప్పుడు ఈ భవనంలోనే బస చేశారు.



### 18వ లోక్‌సభ

- 18వ లోక్‌సభ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రొటెం స్పీకర్ నేతృత్వంలో సభ్యులు ప్రమాణం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 99 ప్రకారం ఎన్నికయిన ప్రతి సభ్యుడు ప్రమాణ స్వీకారం చేయాలి. అలాగే ప్రొటెం స్పీకర్ నేతృత్వంలో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక కూడా జరిగింది. ఓం బిర్లా మరోసారి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లోని కోటా నియోజకవర్గం నుంచి ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 17వ లోక్‌సభకు కూడా ఆయనే స్పీకర్‌గా వ్యవహరించారు. ఇండియా తరపున సురేశ్ స్పీకర్ పదవికి పోటీ చేశారు. అయితే ఎన్డీఏకు స్పష్టమైన మెజారిటీ ఉండటంతో ఓం బిర్లా విజయం సాధించారు. రాజ్యాంగంలోని 93వ అధికరణం ప్రకారం లోక్‌సభ సభ్యులే స్పీకర్‌ను ఎన్నుకుంటారు.

### మంత్రుల పన్ను చెల్లింపు

- తమ వేతనం, ఇతర అలవెన్సులకు సంబంధించి ఆదాయపు పన్నును మంత్రులే చెల్లించాలని మధ్యప్రదేశ్ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 1972లో తీసుకొచ్చిన నిబంధనను మార్చారు. మంత్రులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును రాష్ట్ర ప్రభుత్వమే భరించేది. దానిలో మార్పు చేశారు. మంత్రులే ఇక నుంచి తమ వేతనం నుంచి ఆదాయ పన్ను చెల్లించనున్నారు.

### వరల్డ్ క్రాఫ్ట్ సిటీ

- భారతదేశంలో వరల్డ్ క్రాఫ్ట్ సిటీగా శ్రీనగర్ ఎంపికయ్యింది. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఈ ఎంపికను చేపట్టింది. కళల్లో నైపుణ్యాన్ని తెలుగులో క్రాఫ్ట్ అంటారు. ఇప్పటికే భారత్ నుంచి ఈ జాబితాలో జైపూర్, మామల్లపురం, మైసూర్ ఉన్నాయి.

### ఏఐ ఆధారిత ఫెన్సింగ్

- మానవ-జంతు సంఘర్షణ మూలంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కృత్రిమ మేధ ఆధారిత ఫెన్సింగ్‌ను కేరళ రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. ఇది సౌరశక్తితో పనిచేస్తుంది. వయనాడ్ డివిజన్ దక్షిణాన ఉన్న చెడెలత్ రేంజ్‌లోని ఇరులమ్ అటవీ స్టేషన్ పరిధిలో ఇది అందుబాటులోకి వచ్చింది. దీనికి ఈఎల్ఈ ఫెన్స్ అని పేరు పెట్టారు. ఫెన్సింగ్ సమీపంలోకి జంతువులు వచ్చినప్పుడు కృత్రిమ మేధ ద్వారా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌కు సమాచారం అందుతుంది.

### ఏషియన్ కింగ్ వల్చర్



- ప్రపంచంలో తొలిసారి ఏషియన్ కింగ్ వల్చర్స్ (రాబందులు) బ్రీడింగ్ సెంటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌లోని మహరాజ్‌గంజ్‌లో ఏర్పాటు చేయనున్నారు. అంతరించే దశలో ఉన్న ఈ ప్రాణుల సంఖ్యను పరిరక్షించుకునేందుకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కేంద్రానికి జఠాయువు కన్జర్వేషన్ అండ్ బ్రీడింగ్ కేంద్రం అని పేరు పెట్టారు.

## క్రీడలు

### ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

- అండర్-17 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ 11 పతకాలను సాధించింది. జోర్డాన్‌లోని అమన్‌లో జూన్ 22 నుంచి 24 వరకు ఈ పోటీలు జరిగాయి. భారత్ నాలుగు బంగారు పతకాలతో పాటు రెండు వెండి, నాలుగు కాంస్య పతకాలను కూడా పొందింది.

### స్మృతి మంధాన

- రెండు వరుస వన్డే మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి ఈ ఘనతను ఆమె దక్కించుకుంది.




## తెలంగాణ

### దివ్యాంగులకు రిజర్వేషన్లు

- రాష్ట్రంలోని దివ్యాంగులకు విద్యా సంస్థల్లో 3% ఉన్న రిజర్వేషన్లను ఐదు శాతానికి పెంచుతూ అమలు చేయాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రభుత్వ విభాగాలను నిర్దేశించింది.

### కేంద్రానికి వినతులు

- వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రానికి 2.70 లక్షల పట్టణ ఇళ్లను మంజూరు చేయాలని, స్మార్ట్ సిటీ పథకాన్ని మరో ఏడాది పొడిగించాలని కేంద్ర గృహ, నిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. హైదరాబాద్‌తో పాటు నగరం చుట్టుపక్కల రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు.

### సకిని రామచంద్రయ్య

- కంచేమేళం (డోలి) కళాకారుడు, పద్మశ్రీ గ్రహీత సకిని రామచంద్రయ్య మరణించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ కథను వివరిస్తూ కంచు తాళం, కంచు మేళం వాయించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. 2022లో ఆయనకు పద్మశ్రీ లభించింది.



### రుణమాఫీ

- రాష్ట్రంలోని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయనున్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య ఉన్న వాళ్లకు ఇది వర్తిస్తుంది.

## రోజులు-ప్రాముఖ్యత

### జూన్ 27

- ఏటా జూన్ 27న సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమల రోజుగా పరిగణిస్తారు. భారత జాతీయ ఆదాయంలో వాటాతో పాటు ఉద్యోగాల కల్పనలో ఎంఎస్‌ఎంఈ రంగం కీలక పాత్రను కలిగి ఉంది.

### జూన్ 26

- మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక రోజును ఏటా జూన్ 26న నిర్వహిస్తారు. అదే విధంగా ఇదే రోజును వివిధ రకాల వేధింపులకు గురైన బాధితులకు అండగా ఉండే రోజుగా కూడా జరుపుతారు.

### జూన్ 24

- దౌత్య రంగానికి సంబంధించిన అంతర్జాతీయ మహిళల రోజుగా జూన్ 24న నిర్వహిస్తారు. దౌత్య రంగంలో అలాగే అంతర్జాతీయ సంస్థల్లో మహిళలు చేసిన సేవలకు గుర్తుగా ఈ రోజును నిర్వహిస్తారు.




### జూన్ 23

- ఏటా జూన్ 23న యూఎన్ పబ్లిక్ సర్వీస్ డే గా నిర్వహిస్తారు. అంటే ప్రభుత్వ సేవలు మరింతగా ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించింది. అలాగే ఇదే రోజును ప్రపంచ ఒలింపిక్స్ రోజుగా కూడా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'వేడుక చేసుకొనేందుకు ముందుకు కదులుదాం'.

## వార్తల్లో వ్యక్తులు

### జేపీ నడ్డా

- కేంద్ర వైద్య శాఖ మంత్రి జేపీ నడ్డా రాజ్యసభ నాయకుడిగా నియమితులయ్యారు. అంతకుముందు ఈ పదవిలో పీయూష్ గోయల్ ఉండేవారు.

### రాజా సుబ్రమణి

- భారత సైన్యానికి తదుపరి వైస్ చీఫ్‌గా ఎంపికయ్యారు.

### ప్రదీప్ సింగ్ ఖరోలా

- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి కొత్త డైరెక్టర్ జనరల్‌గా ప్రదీప్ సింగ్ ఖరోలా నియమితులయ్యారు. ఇంతవరకు ఆ స్థానంలో సుబోధ్ కుమార్ సింగ్ ఉన్నారు. అలాగే జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుకు సంబంధించి ఏడుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని కేంద్రం నియమించింది. దీనికి ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నారు.

### మార్క్ రుట్టే

- నాటో చీఫ్‌గా మార్క్ రుట్టే నియమితులయ్యారు. నాటో అనేది 32 దేశాల కూటమి. సైనిక సహకారం కోసం ఏర్పాటయ్యింది. బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా ఇది పని చేస్తుంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

